# నమస్తే తెలంగాణ
# జనగామ

5 | వరంగల్, బుధవారం 20 నవంబర్ 2024 | JANAGAON





హనుమకొండలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అయితే ప్రారంభానికి ముందు రోజు వరకు విద్యుత్‌కాంతులతో మిరుమిట్లుగొలిపిన ఈ భవనం.. సీఎం ప్రారంభించిన కొన్ని గంటలకే లైట్లు వేయకపోవడంతో చిమ్మ చీకటిగా మారింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

## ● బస్సుల్లేక పాట్లు..

వరంగల్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సులన్నీ సీఎం రేవంత్‌రెడ్డి సభకే తరలిపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పలేదు. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, భూపాల పల్లి బస్‌స్టేషన్లలో ప్లాట్‌ఫాంలన్నీ బస్సుల్లేక బోసిపోయి కనిపించగా, గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. వచ్చిన ఒకటీరెండు బస్సుల్లో కిక్కిరిసి పరిమితికి మించి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది ప్రయాణాన్ని విరమించుకుని ఇంటికి వెళ్లిపోగా, ఇంకొందరు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. సీఎం సభకు పెద్ద మొత్తంలో బస్సులను పంపించడంతో ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు మండిపడ్డారు.

- హనుమకొండ చౌరస్తా/ వరంగల్ చౌరస్తా/కృష్ణకాలనీ, నవంబర్ 19



హనుమకొండలో బస్సు రాగానే కిక్కిరిసి ఎక్కుతున్న ప్రయాణికులు

వరంగల్ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

## ● ఆహార పొట్లాల కోసం ఫీట్లు

ఇందిరా మహిళా శక్తి పేరుతో హనుమకొండలో నిర్వహించిన విజయోత్సవ సభలో మహిళల పట్ల కార్యకర్తలు వ్యవహరించిన తీరు సర్వత్రా ఆగ్రహానికి గురిచేసింది. మంగళవారంఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరి కోసం ప్రత్యేక వాహనంలో తెచ్చిన ఆహార పొట్లాలను పంపిణీ చేయాల్సిన కాంగ్రెస్ కార్యకర్తలు పైనుంచి ఇలా విసిరేయడంతో అందరూ ఒక్కసారిగా ఎగబడ్డారు. ప్యాకెట్లను చేతికి అందివ్వకుండా వరద బాధితులకు విసిరేసినట్లుగా విసిరేయడం చర్చనీయాంశమైంది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా 'ఇదేనా కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఇచ్చే గౌరవం' అంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి.

- హనుమకొండ, నవంబర్ 19



హనుమకొండలో నిర్వహించిన సీఎం సభకు వచ్చిన ప్రజలు ఆహార పొట్లాల కోసం ఎగబడుతున్న దృశ్యం

# అర్ధరాత్రి నుంచే నిర్బంధకాండ

**బీఆర్ఎస్ శ్రేణులు, గిరిజన, విద్యార్థి సంఘం నాయకుల నిర్బంధం**

**మాజీ సర్పంచ్‌లు, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులనూ పోలీస్ స్టేషన్లకు తరలింపు**




లింగాలఘనపురంలో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

నమస్తే నెట్‌వర్క్, నవంబర్ 19 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటన సందర్భంగా పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచే ముందస్తుగా ఎక్కడిక క్కడే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారు. మాజీ సర్పంచ్‌లతో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, దళితబంధు సాధన సమితి సభ్యులనూ స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఆరు గ్యారెంటీలపై బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తాయని, పెండింగ్ బిల్లులపై మాజీ సర్పంచ్‌లు నిలదీస్తారని, లగచర్ల ఘటనపై గిరిజన సంఘం నాయకులు అడ్డుకుంటారని, రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై విద్యార్థి సంఘం నాయకులు గొంతెత్తుతారని, దళితబంధు, ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు రచ్చ చేస్తారని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలిచి సమస్యల గురించి ప్రశ్నించాలనుకున్న తమ గొంతును నొక్కుతోందన్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ శ్రేణులు, బీఆర్ఎస్వీ, సీఐటీయూ, డీవైఎఫ్‌యూ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్‌లు, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, దళిత బంధు సాధన సమితి ఉపాధ్యక్షుడు వేమునూరి జక్కయ్య, లంబాడా హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్‌నాయక్, దళిత పోరాట హక్కుల సంఘం నాయకులు ఏలేందర్, రాచర్ల రాజేందర్ తదితరులు ఉన్నారు.

## బలవంతంగా గిరిజనుల భూములు లాక్కోవద్దు : పల్లా



జనగామ అర్బన్ పీఎస్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా : లగచర్ల చుట్టుపక్కల గిరిజనుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కోవద్దని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ అర్బన్ పీఎస్‌లో అక్రమంగా ముందస్తు అరెస్ట్ అయిన లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులను కలిసి తన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ లగచర్ల ఫార్మా ఫ్యాక్టరీ ప్రపోజల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. అరెస్ట్ చేసిన వారిని ఎక్కడ దాచిపెట్టారో కూడా తెలియనివ్వని పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే అరెస్ట్ చేసిన అమాయక గిరిజనుల్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం మీటింగ్‌కు గ్రామాల నుంచి మహిళలు వెళ్లడానికి ఇష్టం లేకపోయినప్పటికి కాంగ్రెస్ నాయకులు, అధికారులు వారిని బెదిరించి బస్సుల్లో తరలించారన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా స్వామినాయక్, లకావత్ నరేశ్, కొర్ర రాజేందర్, ధరంసోత్ కొమురవెల్లి, ధరావత్ శంకర్, కనకరాజు, రమేశ్, వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, ముస్త్యాల దయాకర్, కోఆప్షన్ మెంబర్ మసిఉర్ రెహ్మాన్, బీఆర్ఎస్ నాయకులు నీల యాదగిరి, తిప్పారపు విజయ్, ప్రవీణ్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, దేవనూరి సతీశ్, యాకూబ్ పాషా, కన్నారపు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేసిన హనుమకొండ పోలీసులు, పోలీస్ స్టేషన్ ఎదుట గాంధీనాయక్

# అవిశ్వాసానికి సహకరించాలి

- చైర్మన్, వైస్ చైర్మన్లపై తీర్మానం జరిగేలా చూడాలి
- వీడియో సందేశంలో పోలీసులను కోరిన చౌటపెల్లి పీఏసీఎస్ డైరెక్టర్లు



మాట్లాడుతున్న పీఏసీఎస్ డైరెక్టర్లు

పర్వతగిరి, నవంబర్ 19 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, వైస్ చైర్మన్‌పై బుధవారం నిర్వహించే అవిశ్వాస సమావేశానికి పోలీసులు సహకరించాలని ఆ సంఘం డైరెక్టర్లు మంగళవారం ఓ వీడియో సందేశంలో కోరారు. ఇటీవల సొసైటీలో భారీ అవినీతి చోటు చేసుకుందని, చైర్మన్ రైతుల నుంచి క్రాప్ లోన్ కోసం డబ్బులు వసూలు చేశారని, పీఏసీఎస్ భవనం, ప్రహరీ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, ఫర్నిచర్ కోసం అక్రమంగా రూ. 10లక్షలు డ్రా చేశారని ఆరోపించారు. దీనిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ నెల 20న (బుధవారం) సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించి డైరెక్టర్లకు సమాచారం ఇచ్చారన్నారు.ఈ క్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు అవిశ్వాస తీర్మానం పెట్టొద్దని స్థానిక రాజకీయ నాయకుల పలుకుబడితో తమను బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అవిశ్వాసాన్ని అడ్డుకునేందుకు తమపై దాడి చేస్తారని తెలియడంతో పక్క రాష్ట్రానికి క్యాంపునకు వెళ్లామని, బుధవారం తిరిగి రానున్నామని డైరెక్టర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తమపై దాడి జరగకుండా స్థానిక ఎస్సై, సీఐ, ఏసీపీ, సీపీ తమకు రక్షణ కల్పించి అవిశ్వాసానికి సహకరించాలని కోరుతూ డైరెక్టర్లు సూరినేని సుధీర్‌రావు, మట్టపల్లి అమృతరావు, తూమాటి శ్రీనివాస్‌రావు, వల్లందాసు రంగయ్య, మామిండ్ల అశోక్, పుల్లూరి భిక్షపతి, చాంప్లా, శ్రీలత, దామెర లక్ష్మి ఆగయ్య, ఎర్రబెల్లి నిర్మల వీడియో సందేశాన్ని పంపించారు.



సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న మహిళలను కూర్చోబెడుతున్న పోలీసులు



సీఎం మాట్లాడుతుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

# ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం..

- ఇందిరమ్మ రాజ్యంలో అదానీ, అంబానీలను తలదన్నేలా వ్యాపార వృద్ధి
- ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళా సంఘాలకు రూ.21.466 కోట్ల చెక్కు అందజేత
- కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- రూ.4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం




మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు



అరటి పండ్ల పొట్లాలు తీసుకున్న మహిళా సంఘం సభ్యులు

హనుమకొండ, నవంబర్ 19 : ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వర్లను చేసేందుకు కంకణబద్ధులమై ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ స్టాళ్లను పెట్టిన మహిళలు అదానీ, అంబానీలను తలదన్నేలా వ్యాపారంలో వృద్ధిలోకి వస్తారని చెప్పారు. అంబానీ, అదానీలకు పోటీగా ఆడబిడ్డలకు సౌరవిద్యుత్ వ్యాపారం ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం వరంగల్ నగరంలో పర్యటించారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హనుమకొండ కుడా గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకొని పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అక్కడినుంచి కాళోజీ కళాక్షేత్రానికి చేరుకొని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి కళాక్షేత్ర భవనాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించి రూ. 4601.15 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. భవనాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కళాక్షేత్ర భవన కింది అంతస్తులో కాళోజీ ఫొటోలు, పురస్కారాలు, వ్యక్తిగత వస్తువులతో ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. అనంతరం ఆడిటోరియంలో కాళోజీ జీవిత విశేషాలతో రూపొందించిన లఘుచిత్రాన్ని కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధులు వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం వీక్షించారు. అక్కడి నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి విజయోత్సవ సభకు వెళ్లారు. ముందుగా మైదానంలో స్టాల్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలతో ముచ్చటించి ఉత్పత్తులు, వ్యాపారం తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే 22 మహిళా సమాఖ్య భవనాలను వర్చువల్ విధానంలో ప్రారంభించి, ఒక్కో భవనాన్ని రూ.5 కోట్లతో నిర్మించినన్నుట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంను స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాలువాలతో సత్కరించారు. అనంతరం వేదికపైకి చేరుకొని మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత సీఎంతో పాటు మంత్రులు ప్రసంగించారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపు, ఉత్పత్తిపై డిస్కంల సీఎండీలతో, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళలకు కేటాయించే విషయంలో ఆర్టీసీ ఎండీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు. రాష్ట్రంలోని 2లక్షల 54వేల 864 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21వేల 466 కోట్ల 58 లక్షల చెక్కులను అందజేశారు. వివిధ జిల్లాల మహిళా సంఘాల ప్రతినిధులకు లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ రాజకీయ సలహాదారు కే కేశవరావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవురి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినీరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, మురళీనాయక్, కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎంఏయూడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్, రోడ్ల భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సమాచార శాఖ కమిషనర్ హరీష్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, పీ ప్రావీణ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులు, రైఫిల్ షూటర్ ఇషాసింగ్, బాక్సర్ నిఖత్ జరీన్ పాల్గొన్నారు.

### బల్దియాకు రూ.187 కోట్లు విడుదల

వరంగల్, నవంబర్ 19 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.187.42 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధించిన నిధుల విడుదలకు ఫైనాన్స్ క్లియరెన్స్ ఇచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ స్కీమ్‌లకు సంబంధించి గ్రాంట్ రూపేణా మంజూరు చేసింది. రెండు రోజుల క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.4170 కోట్లు, బల్దియా పరిపాలన భవనం కోసం రూ.32.50 కోట్లు మంజూరు చేసింది.




మహిళా శక్తి విజయోత్సవాల బోర్డ్ వద్ద చెత్త సేకరిస్తున్న యువతి



ఆర్ట్స్ కాలేజీలో భోజనం చేస్తున్న మహిళలు

## అడుగడుగునా ఖాకీలే

సుబేదారి, నవంబర్ 19 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనలో అడుగడుగునా పోలీసు పహారా కనిపించింది. హయగ్రీవాచారి మైదానంలోని హెల్‌ప్యాడ్ నుంచి ఆర్ట్ కళాశాలలోని సభ ప్రాంగణం, సభకు వచ్చే ప్రధాన రహదారుల్లో ఎక్కడచూసినా మోహరించారు. అదనపు డీజీపీ మహేశ్ భగవత్ సీఎం సెక్యూరిటీ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభ కార్యక్రమానికి మూడు గంటల ముందే ప్రధాన గేట్లను మూసివేశారు. సీఎం వెంట మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. పర్యటన బందోబస్తులో ఎప్పుడూలేని విధంగా 1500 మంది పోలీసులు విధుల్లో ఉన్నారు.

**పోలీసుల కళ్లు గప్పి నిరసనలు**

సీఎం పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచే గిరిజన సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అయిన కూడా హనుమకొండ కాళోజీ జంక్షన్ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు, అదాలత్ అమవీరుల జంక్షన్ వద్ద దళితబంధు పథకం అమలు చేయాలని స్వేరోస్ సీఎం కాన్వాయ్ వచ్చే ముందు నిరసన చేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై నిరసనకారులను అరెస్ట్ చేశారు.






కాళోజీ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు, మహిళలను తనిఖీ చేస్తున్న పోలీసులు